క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: మరమ్మత్తుల కారణంగా ఓల్డ్ ముంబై రోడ్డు ఫీడర్, శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 11 వరకు చందానగర్ మెయిన్‌రోడ్డు, బీహెచ్ఈఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబై రోడ్డు ప్రాంతాల్లో.. శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలోని చందానగర్ మెయిన్ రోడ్డు, శిల్పా ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వెల్లడించారు.

మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలి



మొక్కలు నాటిన న్యాక్ ఉద్యోగులు

మాదాపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం మాదాపూర్‌లోని న్యాక్ ప్రాంగణంలో డైరెక్టర్ జనరల్ కె.భిక్షపతి ఆధ్వర్యంలో సంస్థ ఉద్యోగులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. మహిళలు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని, వారు స్వశక్తితో ఎదుగుతూ ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాక్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ శాంతిశ్రీ, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌బీలో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న హేమంగ్‌జానీ తదితరులు

రాయదుర్గం: భారతదేశ జాతీయ దృష్టికి అనుగుణంగా ఐఎస్‌బీ కార్యక్రమాలు చేపడుతోందని కేంద్ర కెపాసిటీ బిల్డింగ్ కమిషన్(సీబీసీ) కార్యదర్శి హేమంగ్‌జానీ పేర్కొన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్ క్లాస్-2022కు చెందిన 140 మంది విద్యార్థులకు సోమవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఐఎస్‌బీలో అధునాతన మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు ఆత్మనిర్భర్ భారత్‌ను రూపొందించాలనే భారత ప్రభుత్వ దృక్పథానికి అనుగుణంగా ఉన్నాయన్నారు. కష్టపడి పని చేయడం చాలా ముఖ్యమని, అందుబాటులో ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో భారతి ఎంటర్‌ప్రైజెస్ వైస్ చైర్మన్ రాకేష్‌భారతి మిట్టల్, ఐఎస్‌బీ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ రామభద్రన్‌తిరుమలై, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ సౌమ్య సింద్వానీ, పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీలోకి చేరికలు

మియాపూర్: దేశంలో మోదీ పాలనకు ఆకర్షితులై యువకులు బీజేపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ అన్నారు మియాపూర్‌లోని బీకే ఎన్‌క్లేవ్ కాలనీలో బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో శివారెడ్డి ఆధ్వర్యంలో వంద మందికి పైగా యువత పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు విసిగిపోయారని, అధికార పార్టీ నాయకులు అభివృద్ధిని మరిచి ప్రభుత్వ భూములు అమ్మడంపై దృష్టి సారించారని విమర్శించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ప్రస్తుత ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా తమ పార్టీ అండగా ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, గణేష్, వినోద్‌యాదవ్, బాబూరెడ్డి, రాము, శ్రీను, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


హైటెక్స్‌లో లాలాల్యాండ్ మార్కెట్

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన లాలాల్యాండ్ ఫీలా మార్కెట్ నగరవాసులను ఆకట్టుకుంది. మహిళలకు, యువతకు కావాల్సిన వస్తువులను స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. యువతను ఆకట్టుకునే విధంగా లైవ్ మ్యూజిక్‌తో పాటు సందర్శకులను ఆకర్షించేందుకు వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు 13వేల మంది సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు.



నెమ్మదించిన సుందరీకరణ

- ఏడాది క్రితం ప్రారంభమైన కొత్తకుంట చెరువు అభివృద్ధి పనులు
- ఇప్పటికీ పూర్తి చేయని కాంట్రాక్టర్
- గుర్రపు డెక్కతో నిండిన చెరువు
- త్వరగా పనులు పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి
- దృష్టి సారించని ప్రజాప్రతినిధులు



గుర్రపు డెక్కతో నిండిపోయి పచ్చని మైదానాన్ని తలపిస్తున్న చెరువు

హఫీజ్‌పేట్: జీహెచ్ఎంసీ నిధులతో పాటు వివిధ సంస్థల సహకారంతో చెరువులు, కుంటలను సుందరీకరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కొన్ని చెరువుల పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. అయితే మరికొన్ని చెరువులను కనీసం పట్టించుకోవడం లేదు. కొత్తకుంట చెరువు చుట్టుపక్కల అభివృద్ధి చెందిన కాలనీలు, పెద్ద పెద్ద భవనాలు ఉన్నాయి. వారికి అందుబాటులో ఉన్న చెరువు మాత్రం అభివృద్ధి చెందడం లేదు. గత ఏడాది ఓ ప్రైవేట్ సంస్థ కొత్తకుంట చెరువు సుందరీకరణ పనులు ప్రారంభించింది. అయితే ఏడాది కావస్తున్నా పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు చెబుతున్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను ఆనుకొని 10 మీటర్ల వరకు ఆట స్థలం కోసం చెరువులోని మట్టిని తీసి పోస్తున్నారు. చెరువులో ఉన్న నల్ల మట్టి ఆట స్థలానికి పనికి రాదని ప్రజలు చెబుతున్నప్పటికీ కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భారీ వర్షాలు కురిసిన సమయంలో వరద దాటికి అమ్మవారి గుడి కూలిపోయింది. అయితే చెరువు పక్కనే అమ్మవారి గుడిని తిరిగి నిర్మిస్తామని చెప్పిన ఓ బిల్డర్ చిన్నపాటి గుడి నిర్మించి చేతులు దులుపుకున్నారు. చెరువు కట్ట సగం వరకు మట్టిపోసినప్పటికీ మిగిలిన సగం కాంట్రాక్టర్ అలసత్వం వల్ల సుందరీకరణ పనులు ముందుకు సాగడం లేదు. వినాయకచవితి, బతుకమ్మ పండుగలు వస్తే చెరువు కట్ట వద్ద హడావుడి చేసి రంగులు, విద్యుత్ దీపాల అలంకరణతో పాటు చెరువులోని చెత్తను తొలగిస్తారు. వేడుకల తర్వాత చెరువును పరిశీలించే అధికారి మాత్రం కనిపించరు.



అసంపూర్తిగా ఉన్న చెరువు కట్ట పనులు

ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు వద్ద చేపట్టాల్సిన పనులు..

- కొత్తకుంట చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలి.
- చెరువులోకి మురుగు నీరు చేరకుండా అసంపూర్తిగా ఉన్న పైప్‌లైన్ పనులు వెంటనే పూర్తి చేయాలి.
- చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్తను తొలగించాలి.
- వాకింగ్ ట్రాక్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.
- చెరువు అలుగు, తూము పనులను ప్రారంభించాలి.
- చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.
- ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి.
- కట్టపై ఉన్న అమ్మవారి గుడిని పునః నిర్మించాలి.
- చెరువు వద్ద ఉన్న మెట్లకు మరమ్మతులు చేపట్టాలి.
- ప్రతిరోజూ చెరువు సంరక్షణ కోసం సిబ్బందిని నియమించాలి.
- చెరువులో భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలి.
- చెరువు కట్టపై ప్రజలు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలి.
- చిన్నారుల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేయాలి.
- ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కు ఏర్పాటు చేయాలి.

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి..



కొత్తకుంట చెరువు సుందరీకరణ పనులను ఏడాది క్రితం ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్ అలసత్వం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. చెరువు కట్టపై ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్ సగమే పూర్తయింది. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.

– శ్రీనివాస్, మదీనాగూడ

నాణ్యత పాటించాలి..



చెరువు కట్టపై నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆట స్థలాల్లో నాణ్యమైన మట్టిని నింపాలి. చెరువులోని నల్ల మట్టి తీసి పోయడం వల్ల వర్షాలు కురిస్తే ఆ ప్రాంతం కుంగిపోతుంది. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గోపాల్, మదీనాగూడ



అసంపూర్తిగా ఉన్న తూము, అలుగు పనులు

ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో ఉన్న రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో విజయగణపతి ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తారు. 8న ఉదయం 9.30 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం పుణ్యాహవచనం, క్షీరాభిషేకం జలాధివాసం, వాస్తుపూజ, వాస్తుబలి, ప్రధాన కలశారాధన, ధాన్యాధివాసం.. సాయంత్రం 4 గంటలకు అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, ఆవరణ హోమం, మూర్తిహోమం, గణపతి మూలమంత్ర హోమం వంటి పూజలు నిర్వహిస్తారు. 9న ఉదయం 8.15 గంటలకు గణపతి పూజ, 9.26 గంటలకు యంత్ర, బింబ, శిఖర, ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, స్వామి వారి దర్శనం, కుంభం, గోదృష్టి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.

స్త్రీ జగతికి మూలం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ అపర్ణ తదితరులు

గచ్చిబౌలి: స్త్రీ జగతికి మూలమని న్యూట్రీషన్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అపర్ణ అన్నారు. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో కమాండెంట్ పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన శాస్త్రవేత్త అపర్ణ, ఇతర మహిళలతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ.. సమాజంలో స్త్రీలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. స్త్రీ సహనశీలి అన్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ.. స్త్రీలు ఉద్యోగంలోనూ, కుటుంబ సంరక్షణలోనూ అద్భుతమైన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బెటాలియన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కళ్యాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: విద్యార్థులు గొప్ప చదువులు చదివి సమాజానికి సేవలు అందించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ సూచించారు. ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో సోమవారం కొండాపూర్ డివిజన్‌లోని కొత్తగూడ, మాదాపూర్, గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆర్‌కేవై ఫౌండేషన్, సందయ్య ట్రస్ట్ పేదలకు సేవలందించేందుకు ఎప్పుడూ ముందుంటుందన్నారు. విద్య, వైద్య రంగాల్లో మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, అనీల్‌కుమార్‌యాదవ్, రమేష్, నర్సింహ, గణేష్‌ముదిరాజ్, అరుణ్ యాదవ్, రాము, పద్మానాగుబాయ్, పార్వతి, రేణుక, జ్యోతి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో టెక్నాలజీ సమ్మిట్



రాయదుర్గం: స్థానిక భాషల్లో జ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన తక్షణ అవసరం ఉందని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ లాంగ్వేజ్ టెక్నాలజీస్ రీసెర్చ్ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ వాసుదేవ వర్మ అన్నారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో వికీమీడియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండవ వికీమీడియా టెక్నాలజీ సమ్మిట్‌ను సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో అనేక రకాల భాషలు మాట్లాడే ప్రజలు పెద్ద సంఖ్యలో ఉన్నారని, ఈ భాషల్లో ఉపయోగకరమైన డిజిటల్ కంటెంట్ మొత్తం లేదన్నారు. వికీపీడియా వంటి క్రౌడ్‌సోర్స్ ఎన్‌సైక్లోపీడియాలు ప్రజల జ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. వికీమీడియా ఫౌండేషన్ చీఫ్ ప్రొడక్ట్ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ సెలీనా డెకెల్‌మాన్ వర్చువల్‌గా మాట్లాడుతూ.. స్థానిక భాషల ప్రాముఖ్యతను గుర్తించడం ముఖ్యమన్నారు. భారత్ వంటి దేశాలలో బహుభాషావాదంతో కూడిన జీవన విధానం ఉందన్నారు.

కుస్తీ పోటీల్లో బంగారు పతకం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణానికి చెందిన సుంకు కారుణ్య ఈ నెల 3, 4, 5 తేదీల్లో కుతుబ్ షాహీ స్టేడియంలో నిర్వహించిన కొత్వాల్ కేసరి కుస్తీ పోటీల్లో ప్రతిభ చూపింది. 50 నుంచి 57 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించింది. హైదరాబాద్ సిటీ కమిషనర్ సి.వి. ఆనంద్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నట్లు ఆమె తెలిపింది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



షన్వితకు పూలమొక్క అందజేస్తున్న కార్పొరేటర్ సింధు, పక్కన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని జూనియర్ నేషనల్ టెన్నిస్ క్రీడాకారిణి నూకల షన్విత రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ హాల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఆయన సతీమణి యాదమ్మ, కార్పొరేటర్ సింధు, ఎంపీపీ సుష్మశ్రీ, జెడ్పీటీసీ సుప్రజారెడ్డి షన్వితను శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా షన్విత మాట్లాడుతూ.. మహిళలు రాజకీయాలు, క్రీడలు, ఉద్యోగాల్లో దూసుకుపోతున్నారన్నారు. తన తండ్రి నూకల వేణుగోపాల్ రెడ్డి(పటాన్‌చెరు సీఐ) ప్రోత్సాహంతో వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లో జూనియర్ టెన్నిస్‌లో రాణిస్తున్నానని చెప్పారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను ప్రోత్సహిస్తే ఉన్నత స్థానాల్లో నిలుస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

గ్యాస్ ధర తగ్గించాలని నిరసన



మియాపూర్: పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్‌లో ఏఐఎఫ్‌డీడబ్ల్యూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఎం.రాణి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేనాటికి రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1185కు చేరిందన్నారు. కరోనా సంక్షోభంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి వారిని మరిన్ని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, గీత, వనజ, మొగులమ్మ, పార్వతమ్మ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

జ్యువెలరీ స్టూడియో ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన జ్యువెలరీ స్టూడియోను సోమవారం సినీ నటి లావణ్య త్రిపాఠి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరవాసులను ఆకట్టుకునే విధంగా ఆభరణాలు ఉన్నాయని, ప్రముఖ డిజైనర్లచే తయారు చేసిన వస్తువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు ఉన్నట్లు తెలిపారు.

ఆ గదిలో ఏం జరిగింది..?

పటాన్‌చెరు టౌన్: ఓ ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మెడకు తాడు బిగించుకుని ఒకరు చనిపోగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. అందులోనూ ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎవరూ స్పృహలో లేరు. ఈ ఉదంతం భానూర్-బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి, బీడీఎల్ సీఐ వినాయక్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలోని ఓ రేకుల షెడ్డులో ఒడిశాకు చెందిన నిరుదలై, తుకున నాయక్, అభిదలై ఐదేళ్లుగా ఉంటున్నారు. రెండు వారాల క్రితం ఇదే రాష్ట్రానికి చెందిన బిసుదలై(30) ఇక్కడకు వలస వచ్చి వీరి రూమ్‌లో చేరాడు. నలుగురూ స్థానికంగా ఓ మేస్త్రీ వద్ద పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి ఆ రూమ్‌లో ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. బిసుదలై మెడకు తాడు బిగించి చనిపోయి ఉన్నాడు. మిగతా ముగ్గురు తీవ్రంగా గాయపడి ఉన్నారు. సోమవారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు చేరుకుని గాయాలపాలైన ముగ్గురిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

అనుమానాలెన్నో..

బయట నుంచి వచ్చి ఎవరైనా వీరిపై దాడి చేశారా? లేదా ముగ్గురిపై దాడి చేసిన తర్వాత బిసుదలై ఆత్మహత్యకు పాల్పడ్డాడా? నలుగురిలో ఒకరంటే ఒకరికి పడక ఘర్షణ పడ్డారా.. అసలేం జరిగి ఉంటుంది? ఇలా వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చదనంలో 'మనూ'కు మొదటి బహుమతి



విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం ఎదుట గ్రీనరీ దృశ్యం

రాయదుర్గం: రాష్ట్ర ఉద్యానవన శాఖ నిర్వహించిన 7వ గార్డెన్ ఫెస్టివల్, 1వ అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్‌లో పచ్చదనాన్ని కాపాడినందుకు గాను మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం మొదటి బహుమతి సాధించింది. ఈ సందర్భంగా 'మనూ' ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర హార్టికల్చర్ శాఖ ప్రతినిధుల బృందం జనవరి 23న పచ్చదనం, ప్రకృతి దృశ్యం అభివృద్ధి అంశాలను క్యాంపస్‌లో పరిశీలించారని చెప్పారు. అనంతరం పలు విద్యా సంస్థలచే నిర్వహించే తోటలు కేటగిరీ కింద ఈ అవార్డు కోసం దరఖాస్తు చేశామని, ఈ నేపథ్యంలో యూనివర్సిటీ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. క్యాంపస్‌లో పచ్చదనాన్ని కాపాడుకోవడంలో ఇంజనీరింగ్ విభాగం, హార్టికల్చర్ విభాగం చేస్తున్న కృషిని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అభినందించారు.

ఆకట్టుకుంటున్న చిత్ర ప్రదర్శన



చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న చందనాఖాన్ తదితరులు



ప్రదర్శనలో ఉంచిన ఓ చిత్రం

మాదాపూర్: మహిళా కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వర్క్‌షాపులో వేసిన చిత్రాలను సోమవారం ప్రదర్శనలో ఉంచారు. కళాకారుడు సోమశేఖర్ వేసిన బంజారా చిత్రాల ప్రదర్శనను రిటైర్డ్ ఐఏఎస్ చందనాఖాన్, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కళాకారులను ప్రోత్సహించాలన్నారు. ఈ ప్రదర్శన 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రదర్శనలో 115 పెయింటింగ్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డెర్మటాలజిస్ట్ డాక్టర్ కె.రాజ్యలక్ష్మి, సీనియర్ ఆర్టిస్ట్ డాక్టర్ కె.ప్రహ్లాద్, ఆర్టిస్ట్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మార్పు ఇంటి నుంచే మొదలు కావాలి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి



సునీతాలక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ

పటాన్‌చెరు: మహిళల అభ్యున్నతికి ఇంటి నుంచే మార్పు మొదలు కావాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ ఆధ్వర్యంలో సోమవారం పటాన్‌చెరు జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు వంటింటి నుంచి అంతరిక్షం వరకు సత్తా చాటుతున్నా.. నేటికీ ఎక్కడో ఓ చోట గృహ హింసకు గురవడం బాధాకరమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహిళలు ఆర్థిక సమృద్ధి సాధిస్తున్నారన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించి, ఉమెన్ హబ్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. 20 ఏళ్లుగా మహిళా దినోత్సవం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి శుభాభినందనలు తెలిపారు. అదనపు ఎస్పీ ఉషా విశ్వనాథ్ మాట్లాడుతూ.. మహిళల రక్షణకు ప్రభుత్వం షీ టీంలు, సఖి సెంటర్లు ఏర్పాటు చేసిందన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మహిళా పక్షపాతి అని, 2,469 మహిళా సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.226 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు భీమేష్ సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కోడలు డాక్టర్ కిరణ్మయి విష్ణువర్ధన్ రెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ విజయ తదితరులు వారి అనుభవాలను వివరించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు విరాళం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీ హజరత్ దాదా సైలాని బాబా దర్గా ఉర్సు ఉత్సావాల కోసం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధుముదిరాజ్ సోమవారం రూ.1.25లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, మైనార్టీల చదువు కోసం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పారన్నారు. కార్యక్రమంలో ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదీర్, నాయకులు రెహాన్ ఖాన్, అస్లాం, ఇర్ఫాన్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.